

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.146	212	241
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.146	212	241

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.4 । కనిష్ఠం 19.0



● గుట్టలో శాస్త్రోక్తంగా రథసప్తమి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం రథసప్తమి వేడుకలు, పాతగుట్ట ఆలయంలో అధ్యయనోత్సవాలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్‌సేవోత్సవం నిర్వహించారు.

•5లో..



● చెర్వుగట్టులో బ్రహ్మోత్సవాలు ఆరంభం

నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



రైతుబంధుకు బ్రేక్

రైతుబంధు సాయానికి బ్రేక్ పడినట్టేనని అంతా భావిస్తున్నారు. ఈనెల 12వ తేదీ వరకే రైతులకు పెట్టుబడి సాయం అందింది. ఆ తరువాత రోజు నుంచి రైతుబంధు సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలో జమకావడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లా రైతులు ఎదురుచూస్తున్నారు. యాసంగి సీజన్ ముగుస్తున్నా, రైతుబంధుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదు.

- నల్లగొండ

- ఈనెల 12వ తేదీన నిలిచిన ప్రక్రియ
- ముందుకు సాగని పథకం
- నేటికీ మూడెకరాలకు మించని సాయం
- ఉమ్మడి జిల్లాలో రూ.493.69కోట్లు జమ
- యాసంగి ముగుస్తున్నా అందని పెట్టుబడులు

ఎన్నికలకు ముందే రైతుబంధు సాయం రావాల్సి ఉండగా, ఎన్నికల కమిషన్ జోక్యంతో ఈ ప్రక్రియ నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖజానా ఖాళీగా ఉందని ప్రకటించింది. ప్రతిపక్షాలు, రైతుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో ప్రభుత్వం డిసెంబరు 11వ తేదీ నుంచి రైతుబంధు సాయాన్ని అందజేసున్నట్టు ప్రకటించింది. కాగా, అప్పటి నుంచి రైతుబంధు నగదు జమ నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు మూడెకరాల రైతులకు కూడా పూర్తిమొత్తంలో సాయం అందలేదు. దీంతో యాసంగి సీజన్ ప్రారంభంలో చేతిలో పెట్టుబడి డబ్బు లేక రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశారు. ఇటీవలే ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పూర్తిస్థాయిలో రైతుబంధు ఇస్తామని ప్రకటించగా, 67రోజులైనా సొమ్ము అందకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు.

మళ్లీ బ్యాంకర్ల నుంచి రుణమాఫీ లెక్కల సేకరణ

అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రుణమాఫీకి సంబంధించి బ్యాంకుల నుంచి రైతుల వివరాలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వం నిధుల కొరతతో రుణమాఫీని నిలిపివేయగా, కొత్త ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 ఎన్నికలకు ముందు రూ.1లక్ష వరకు రుణమాఫీ చేస్తానని ప్రకటించినా అది ఆచరణ సాధ్యం కాలేదు. గత ఏడాది ఎన్నికల ముందు ఆగస్టు 15న రుణమాఫీని మళ్లీ ప్రారంభించినా కొంతమందికే లబ్ధి చేకూరింది.

మూడున్నర ఎకరాలకు రైతుబంధు రాలేదు



నాకు మూడున్నర ఎకరాల భూమి ఉంది. ఇప్పటి వరకు రైతుబంధు జమకాలేదు. ఈ ఏడాది పెట్టుబడుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నాం. యాసంగి సీజన్ ముగుస్తున్నా రైతుబంధు సాయం చేయకపోవడంతో అప్పుపై వడ్డీ పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రైతుబంధు సాయాన్ని ఇచ్చి ఆదుకోవాలి.

- వనపర్తి వెంకటయ్య, రైతు, రామలింగాలగూడెం, తిప్పర్తి

ప్రతీ ఒక్క రైతుకు పెట్టుబడిసాయం

అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ అవుతుంది. అదేవిధంగా రైతుబంధు నిధులు ప్రతీ రోజు రైతుల ఖాతాలో జమ అవుతున్నాయి.రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వంనుంచి ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వం సమీక్ష నిర్వహించిన అనంతరం విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలు రాగానే రుణమాఫీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అవుతుంది.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

ఖజానా ఖాళీనా? ప్రణాళికా లోపమా?

ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికి గత ప్రభుత్వం 11 విడతలుగా రంగారెడ్డి జిల్లా ట్రెజరీ కార్యాలయం నుంచి మానిటరింగ్ చేస్తూ రైతుబంధు సొమ్మును జమచేసింది. ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం రైతుబంధు నిధులు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కమిషన్‌కు ఓకే చెబితే జమ చేస్తామని అప్పటి మంత్రి హరీ‌ష్‌రావు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేయడంతో నిధుల విడుదలను ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసలు రైతుబంధుకు సంబంధించిన నిధులు లేనే లేవని, ఖజానా ఖాళీగా ఉందని ప్రకటించడం గమనార్హం. ఖజానా ఖాళీ అవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు నిధులు జమ చేస్తుందా? లేదా? లేక ప్రణాళికా లోపమా అనేది తేలడం లేదు. కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు రైతుబంధుపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించలేదు. అసలు ఎన్ని ఎకరాలకు రైతుబంధు ఇస్తారనే దానిపై స్పష్టత లేదు.

రూ.493.69కోట్ల మేర చెల్లింపులు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు సాయం ప్రారంభించి 67 రోజులు గడిచినా పూర్తిస్థాయిలో మాత్రం నేటికీ ముందడుగు పడలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మొత్తం రూ.1,450 కోట్లు పెట్టుబడి సాయంగా అందాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.493.69కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమయ్యాయి. నల్లగొండ జిల్లాలో 5,42,106మంది రైతులకు ఇప్పటి వరకు 3,75,956 మంది ఖాతాల్లో రూ.251.51కోట్లు జమయ్యాయి. ట్రెజరీకి 4,72,502 మందికి సంబంధించిన వివరాలతో పాటు రూ.434.53కోట్లకుపైగా నగదు విడుదలైనట్టు అధికారులు చెబుతుండగా, వాస్తవంగా రూ.251కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమయ్యాయి. అయితే ట్రెజరీకి పంపించిన నగదు కాగితాలపై లెక్కలేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో 2,93,689మంది రైతులకు 2,12,204మందికి రూ.130.8కోట్లు జమయ్యాయి. యాదాద్రి జిల్లాలో 1,81,63మంది రైతులకు రూ.112.10కోట్లు జమయ్యాయి. దీంతో ఇకపై రైతుబంధు అమలు అవుతుందా? లేదా? అనేది సందేహంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా ఎకరానికి రెండు పంటలకు రూ.15వేలు ఇస్తామని పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు దానికి సంబంధించిన ప్రణాళిక రూపొందించకపోగా, గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు సాయాన్ని సైతం కొనసాగించకపోవడం గమనార్హం.

గొర్రెల మంద.. భలే దందా

- మధ్యవర్తుల నుంచి పెద్ద సంఖ్యలో గొర్రెల యూనిట్ల కొనుగోళ్లు
- ఏపీ నుంచి 1,066కిపైగా యూనిట్ల కొనుగోలుపై గందరగోళం
- అనుమానంతో ఫైల్‌ను పక్కన పెట్టిన గత కలెక్టర్ కర్ణన్
- గోప్యత పాటిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు



నల్లగొండ, ఫిబ్రవరి 16: జిల్లా పశుసంవర్ధక శాఖలో కొందరు అధికారులు, డాక్టర్లు, సెక్షన్ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా గొర్రెల యూనిట్లను కొనుగోలు చేసి అక్రమాలకు పాల్పడ్డట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గొర్రెల పంపిణీ పథకంలో ఇప్పటికే కాగ్ నివేదికలో నల్లగొండ జిల్లాలో పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని తేలింది. ఎన్నికల ముందు ఓ అధికారి సుమారు 1,066 యూనిట్ల గొర్రెలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో రైతుల నుంచి నిబంధనల మేరకు గొర్రెలు సేకరించాలి. అయితే రైతుల నుంచి కాకుండా మధ్యవర్తుల నుంచి గొర్రెలను సేకరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రైతుల నుంచి గాక ఒక మధ్యవర్తి వద్ద 25 గొర్రెల యూనిట్లు కొనుగోలు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వాస్తవానికి ఒక్కో రైతు నుంచి 10 యూనిట్ల గొర్రెలే కొనుగోలు చేయాలి. కానీ మధ్యవర్తి వద్ద ఎక్కువ సంఖ్యలో యూనిట్లు కొనుగోలు చేసి జిల్లాకు తరలించారు. గతంలో గొర్రెల రీసైక్లింగ్‌పై సుమారు 86 కేసులు నమోదై అవి కోర్టుల్లో విచారణలో ఉండగా, తాజాగా నిబంధనలకు విరుద్ధంగా యూనిట్ల కొనుగోలు వ్యవహారం వెలుగుచూసింది.

నల్లగొండ జిల్లాలో అవినీతిపై కాగ్ నివేదిక

గొర్రెల పంపిణీ అమలులో ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి, వరంగల్ జిల్లాలతో పాటు నల్లగొండ జిల్లాలో కూడా అక్రమాలు జరిగాయని కాగ్ స్పష్టం చేసింది. నల్లగొండ జిల్లాలో 126 గొర్రెలను ఒక్క ఆటోలో తరలించినట్టు అధికారులు ఫైల్‌లో నమోదు చేశారు. ఇన్‌వాయి‌స్‌లో పేర్కొన్న వాహనాల నెంబర్లు కూడా ప్రయాణికులవని తేలింది. నకిలీ ఇన్‌వాయిస్ వాహనాలకు బిల్లులు చెల్లించారని కాగ్ గుర్తించింది. ఈ అక్రమాలు జిల్లా స్థాయిలోనా? రాష్ట్ర స్థాయిలోనా? అనేది విచారణలో తేలాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలోని 1,172 ఉదంతాల్లో నకిలీ ఇన్‌వాయి‌స్‌లకు చెల్లింపులు చేసినట్లు కాగ్ నివేదికలో వెల్లడించింది.

గొర్రెల యూనిట్ల కొనుగోళ్లలో అక్రమాలు లేవు

గొర్రెల యూనిట్ల బిల్లుల చెల్లింపులకు సంబంధించి గత కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఉన్న సమయం నుంచి ఫైల్ పెండింగ్‌లో ఉన్నది వాస్తవమే. అప్పటి కలెక్టర్‌తో పాటు ప్రస్తుత కలెక్టర్ కూడా పరిశీలిస్తామని చెప్పారు. గొర్రెల యూనిట్ల కొనుగోలు సమయంలో జిల్లాలో నేను లేను. కొద్ది రోజుల క్రితమే బాధ్యతలు చేపట్టా. గొర్రెల కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు లేవు. ఒక్కో రైతు నుంచి 10 నుంచి 12 యూనిట్లు కొనుగోలు చేసేందుకు నిబంధనలు ఉన్నాయి.

- ఎంవీ.సుబ్బారావు, నల్లగొండ జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ

1,066యూనిట్ల ఫైల్ పెండింగ్.

ఓ ఉన్నతాధికారితో పాటు సెక్షన్ ఉద్యోగి సెలవుల్లో ఉన్న సమయంలో జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలోని ఓ ఇన్‌చార్జి అధికారి గొర్రెల యూనిట్ల ఫైల్‌లను బిల్లుల చెల్లింపుల కోసం కలెక్టరేట్‌కు పంపారు. ఒక యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటాయి. అయితే ఒకే రైతు వద్ద ఇన్ని యూనిట్ల గొర్రెలు ఉండవు. అయితే మధ్యవర్తులతో కుమ్మక్కై యూనిట్ల సేకరణ చేసినట్టు తెలుస్తోంది. ఇంత జరిగినా పశుసంవర్ధకశాఖ అధికారులు గోప్యత పాటించడం గమనార్హం. ఎన్నికల కంటే ముందే ఈ గొర్రెల యూనిట్లను సేకరించి ఏపీలోని ప్రాంత రైతులకు ఆయా యూనిట్లకు సంబంధించి బిల్లులను జమ చేయాల్సి ఉంది. అయితే అప్పటి కలెక్టర్ కర్ణన్ ఈ ఫైల్‌ను పరిశీలించి అనుమానాలు రావడంతో పక్కనపెట్టారు. మళ్లీ పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రస్తుత కలెక్టర్ హరిచందనకు తిరిగి ఫైల్‌ను పంపించడంతో ఆమెకు సందేహాలు రావడంతో పక్కన పెట్టినట్టు తెలిసింది. పూర్తిస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని పశుసంవర్ధకశాఖ అధికారులతో కలెక్టర్ వ్యాఖ్యానించినట్లు వినికిడి. 1,066 యూనిట్లలో అర్హులు ఎంత మంది? మధ్యవర్తుల పాత్ర ఉందా? కొందరి వద్దే ఎక్కువ యూనిట్లు ఎందుకు కొనుగోలు చేశారు? పశుసంవర్ధకశాఖ అధికారుల పాత్ర ఉందా? అనే దానిపై లోతుగా విచారణ సాగుతున్నట్టు సమాచారం. కాగా, బిల్లుల ఫైల్ పెండింగ్ పడటంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. విచారణలో అక్రమాలు నిజమని తేలితే పశుసంవర్ధకశాఖ అధికారులకు ఉచ్చు బిగించనుంది. ఒక్కో యూనిట్‌కు రైతుల వాటా ధనంపోగా రూ.1.48లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంది.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 16: గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, అభివృద్ధి పనులపై ఎంపీడీవోలు దృష్టిసారించాలని కలెక్టర్ హరిచందన అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, గ్రామాల్లో సీసీరోడ్లు, సబ్ సెంటర్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో తాగునీటి పరిస్థితిని విశ్లేషించి వేసవి దృష్ట్యా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా హరితహారం ఎక్కడ మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద సాధ్యమైనంత ఎక్కువ పనులు గుర్తించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద ఆయా మండలాల వారీగా చేతి వృత్తుల వారిని గుర్తించి లక్ష్యాన్ని నిర్దేశించాలన్నారు. మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలన్నారు. ఎస్సీఎస్టీ రుణాల మంజూరు, ప్రధాన మంత్రి బీమా పథకం కింద అసంఘటిత కార్మికుల నమోదును పూర్తిచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ కోటేశ్వరరావు, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖాధికారి కొండలరావు, ఎల్‌డీఎం శ్రామిక్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ పరిశీలన

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాములో నిర్వహిస్తున్న ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ(ఎఫ్ఎల్‌సీ)ని కలెక్టర్ హరిచందన శుక్రవారం పరిశీలించారు. ఈసీఐఎల్‌కు చెందిన 20మంది ఇంజనీర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. జిల్లా లో 4,222బ్యాలెట్ యూనిట్లు, 2,296 కంట్రోల్ యూనిట్లు, 2,784వీవీ ప్యాట్లు ఉండగా, అందులో 4,072 బ్యాలెట్‌యూనిట్లు, 2,291 కంట్రోల్ యూనిట్లు, 2,779 వీవీ ప్యాట్లు ఎన్నికల నిర్వహణకు అనువుగా ఉన్నాయి.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. స్థానిక ఎన్జీ కళాశాలలో నిర్వహించిన స్వీప్ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్,కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, స్వీప్ నోడల్‌అధికారి అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి

దామరచర్ల: యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ వద్ద నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరిచందన అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని యాదాద్రి థర్మల్ పరిశ్రమను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈనెల 20న పరిశ్రమ ఆవరణలో జరగనున్న ప్రజాభిప్రాయర సేకరణ స్థలాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు రంగారెడ్డి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 16: కార్మికుల హక్కులను కాలరాసేందుకు తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సంయుక్త కార్మిక, కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక సుందరయ్య పార్క్ నుంచి రాజీవ్ చౌక్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ప్రధాన వీధుల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షకుల వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ఎంఎస్‌పీ చట్టం చేయాలని రైతులు నిరసన తెలిపేందుకు ఢిల్లీకి వెళుతుంటే అనేక రకాల నిర్బంధాలను ప్రయోగిస్తున్నారన్నారు. గతేడాది ఉద్యమ విరమణ సందర్భంగా రైతు సంఘాలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఉద్యమకారులపై మోదీ ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో 750 మంది రైతులు చనిపోతే పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారన్నారు. రైతులకు రూ.6వేలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ కార్పొరేట్లకు రూ.లక్షలకోట్లు బ్యాంకు రుణాల ఎగవేతకు అవకాశం ఇస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాలవల్ల ప్రజల ఆదాయం పడిపోతోందన్నారు. ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం దేశంలో 80 కోట్లమంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర గ్యారెంటీ చట్టం తేవాలన్నారు. ధర్నాలో సీపీఐ జిల్లా కమిటీసేత బంటు వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, పిల్లుట్ల సైదులు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఎండీ చాంద్‌పాషా, బొంధు పార్వతి, మల్లీశ్వరీ, రషీదా, చౌగాని వెంకన్న, కరీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నిత్యానందన్

నల్లగొండ, ఫిబ్రవరి 16: జిల్లాకేంద్ర ఆస్పత్రికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఎస్.నిత్యానందన్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పాథాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. సూపరింటెండెంట్ లచ్చునాయక్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడడంతో నిత్యానందన్‌ను నియమించారు.



సేల్స్ రంగంలో రాణించాలనుకుంటున్నారా?

అయితే ఆంధ్రజ్యోతి మీకు మంచి అవకాశం కల్పిస్తోంది మీరు చేయవలసినదల్లా ఆంధ్రజ్యోతి దినపత్రికకు చందాదారులను చేర్పించటమే

ఆసక్తి ఉత్సాహము గల అభ్యర్థులకు సేల్స్ రంగములో మెళకువలు నేర్పించి తగిన శిక్షణ ఇవ్వబడును.

- నెలసరి వేతనం రూ.9000/-.
- బుక్‌చేసిన కాపీ ఒక్కింటికి రూ.70/- ల చొప్పున ఇన్సెంటివ్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరూ నెలకు సుమారు రూ.14,500/- పైన ఆదాయం పొందే అవకాశం కలదు.

అర్హతలు

1. వయస్సు: 19-30 సంవత్సరాల యువకులకు ఇది ప్రత్యేకం.
2. తెలుగులో అనర్గళంగా మాట్లాడగలగాలి.
3. విద్యార్హత: ఎస్.ఎస్.సి ఆపైన...

ఈ క్రింది ప్రాంతాలలో పని చేయుటకు ఆసక్తిగలవారు సంప్రదించండి

నల్లగొండ : సత్యనారాయణ - 9985410334, రమేష్ - 9912405565
సూర్యాపేట : వెంకన్న - 9985411408
కోదాడ : నాగేశ్వరరావు - 9848730311
దేవరకొండ : వెంకటేశ్వర్లు - 9392062350
భువనగిరి : నాగరాజు - 7660936837
మోత్కూరు : లక్ష్మయ్య - 9848448385

A VI ANAND FANTASY From the Director of టైగర్
SUPER HIT నేడే చూడండి


సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

కల్పనా చిత్ర


మీ అభిమాన థియేటర్లలో

సిమెంట్ కంపెనీ అటవీభూములను ఆక్రమిస్తోంది

● సున్నపురాయి ఉత్పత్తి పెంపు ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకోండి ● హైకోర్టులో మట్టపల్లివాసుల పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాగర్ సిమెంట్స్ సున్నపురాయి ఉత్పత్తి పెంపు అంశంపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోవద్దని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇతర శాఖల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తున్న పిటిషనర్లు, ఇతరులు సమావేశంలో పాల్గొనవచ్చని తెలిపింది. ఈ నెల 17న నిర్వహించతలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణపై తమ అనుమతి లేకుండా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోవద్దని స్పష్టంచేసింది. సున్నపురాయి ఉత్పత్తి పెంచుకునేందుకు వీలుగా సాగర్ సిమెంట్స్ కంపెనీకి అనుమతిచ్చేందుకు నిర్వహించ తలపెట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకోవాలని.. అలాగే సదరు కంపెనీ అటవీప్రాంతాన్ని ఆక్రమిస్తూ అక్రమ మైనింగ్ చేస్తోందని పేర్కొంటూ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్.. డివిజనల్ ఫారెస్ట్ అధికారికి లేఖ సైతం రాశారని పేర్కొంటూ సూర్యాపేట జిల్లా మట్టపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది గోవింద్ మాలోతు వాదనలు వినిపిస్తూ.. పెద్దవీడు, మట్టపల్లి గ్రామాల్లో సున్నపురాయి ఉత్పత్తి పెంచుకునేందుకు అనుమతిచ్చేందుకు ఈ నెల 17న ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీఎస్‌పీసీబీ) నల్లగొండ రీజనల్ కార్యాలయ ఇంజనీర్ నోటీసులు జారీచేశారని.. ఈ నోటీసును కొట్టేయాలని పేర్కొన్నారు. దీనివల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని.. వ్యవసాయ, పోడు భూములు, నివాసగృహాలు దెబ్బతింటాయన్నారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సేల్ డీడ్ రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పోలీసు, రెవెన్యూ, అటవీశాఖల అధికారులతోపాటు సాగర్ సిమెంట్స్ సహా ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. ఈ నెల 17న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో ఆయా గ్రామాల ప్రజలందరూ పాల్గొనవచ్చని పేర్కొంది. సమావేశానికి సంబంధించి కోర్టు అనుమతి లేకుండా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

సాగర్ సిమెంట్‌లో నేడు ప్రజాభిప్రాయ సేకరణ

మఠంపల్లి: మండలంలోని సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో మైనింగ్ ఉత్పత్తిని విస్తరించేందుకు నేడు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. పెదవీడు పరిధిలోగల సున్నపురాయి గనులను 3.8ఎంటీపీ సామర్థ్యంనుంచి 5.4 ఎంటీపీ వరకు పెంచుకునేందుకు 328.58 హెక్టార్లలో గనులు విస్తరించేందుకు పరిశ్రమ యాజమాన్యం ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజులు వేదిక స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంత వాతవరణంలో నిర్వహించేలా ప్రజలు సహకరించాలని కోరారు.

16ఎన్‌ఎల్‌జీ16: స్టేట్ ఫైనాన్స్ కమిటీ మెంబర్‌గా ఎంపికైన సంకెపల్లి

ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా సూర్యాపేట జిల్లా వాసి

ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా సూర్యాపేట జిల్లా వాసి

● తిరుమలగిరికి చెందిన సుధీర్‌రెడ్డి ఎంపిక
● సీఎంకు సన్నిహితుల్లో ఒకరు
● ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి


సుధీర్‌రెడ్డి

తిరుమలగిరి, ఫిబ్రవరి 16: రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన సంకెపల్లి సుధీర్‌రెడ్డి ఎంపికయ్యారు. స్టేట్ ఫైనాన్స్ కమిటీలో చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్యతో పాటు ముగ్గురు కమిటీ సభ్యులు పేర్కొంటూ ప్రభుత్వం గవర్నర్‌కు పంపగా, వెంటనే ఆమోదం తెలిపారు. ఈ కమిటీలో సభ్యుడిగా సంకెపల్లి సుధీర్‌రెడ్డి ఒకరు. తన ఎన్నికకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సన్నిహితుడు

సుధీర్‌రెడ్డి 20 ఏళ్లుగా కాంగ్రెస్‌పార్టీలో పనిచేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుల్లో ఈయన ఒకరు. హైదరాబాద్ రెడ్డి హాస్టల్‌లో రేవంత్‌రెడ్డితో పాటు కలిసి చదువుకున్నారు. బీఎస్సీ పూర్తి చేసిన సుధీర్‌రెడ్డి ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉప్పల్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా సుధీర్‌రెడ్డి సేవలందించారు. తండ్రి రిటైర్డ్ టీచర్. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నారు. స్వశక్తితో పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు.

ఆహారపు అలవాట్లలో మార్పులు అవసరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామగిరి, ఫిబ్రవరి 16: ఆహారశైలిలో మార్పుల వల్ల షుగర్ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుందని, ఈ ఆహారపు అలవాట్లలో మార్పులు అవసరమని స్పెషల్ మొబైల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.సౌందర్య అన్నారు. నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడెంలో లయన్స్ క్లబ్ శక్తి, న్యూ వాయిసెస్, ఇండియన్ పొడియాట్రీ అసోసియేషన్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ కేవీఎస్ఎస్ సంతోష మూర్తి, డాక్టర్ రిషికేష్‌లు షుగర్ వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై స్పెషల్ మొబైల్‌కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సౌందర్య మాట్లాడుతూ షుగర్ వ్యాధి కారణంగా ప్రతీనెలా 300 నుంచి 500 అంపిటేషన్లు జరుగుతున్నాయన్నారు. వాటిని తగ్గించడానికి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీఎస్ఎన్ సంతోష్‌మూర్తి, డాక్టర్ రిషికేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూ వాయిసెస్ అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సిరాణి పసలపూడి, కోశాధికారి సరిత, వైస్ ప్రెసిడెంట్ ఇందిర, లయన్స్ క్లబ్ సభ్యులు కేవీ ప్రసాద్, డాక్టర్ పుల్లారావు, ఆర్గనైజర్ గ్రేస్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


లక్ష్మమ్మ(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 16: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం అంతమ్మగూడెం గ్రామానికి చెందిన వస్పరి లక్ష్మమ్మ (105) శతాధిక వృద్ధురాలు శుక్రవారం మృతిచెందారు. గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ లక్ష్మమ్మ మృతి చెందారు. ఆమె భర్త శంబయ్య 2009లో 95 ఏళ్ల వయస్సులో మృతి చెందాడు. వీరికి ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా ప్రస్తుతం ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

SUPER HIT నేడే చూడండి


దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70 ఎంఎం - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర 70 ఎంఎం - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
BHAVANI FILMS 9848028739

విజయవంతమైన 2వ వారం


సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.15,6.00,9.15
GLOBAL CINEMAS LLP

బిడ్డను పొదిగే గర్భంలో గొడ్డలి దించిన కర్కశత్వం


GLOBAL CINEMAS LLP

SUPER HIT నేడే చూడండి
గోదావరి అందాలను అద్భుతంగా చూపించిన చిత్రం


లక్ష్మీకళ సినిప్లెక్స్ ఎ/సి - మూసాపేట్
SKML MOTION PICTURES (GANESH BHARI) 9296509333

నేడే చూడండి


శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
11.00,2.00,6.00,9.00
SRIMATHA CREATIONS RELEASE 9396820630

RS PRAVEEN KUMAR BIOPIC
SUPER HIT నేడే చూడండి


మహేశ్వరి - మహేశ్వరం 11.00,2.00,6.00,9.00
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.35am
PVR గలేరియా - పంజాగుట్ట 10.10am
INOX జీవీకే మాల్ - మదీనగూడ 11.00am
INOX నెల్లూస్ సత్య - కావాడిగూడ 11.30am
PRAVEEN IPS MOVIE TEAM 9989522999

కన్నుల పండువగా రథసప్తమి వేడుకలు



ఏడుగుర్రాల రథంపై ఊరేగుతున్న స్వామివారు



పాతగుట్టలో పురప్పాటు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 16 : ఏక శిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం రథసప్తమి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పిన ఆచార్యులు నిజాభిషేకం, నిత్యార్చనలు జరిపి ప్రాకార మండపంలో హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సూర్యప్రభవాహనంపై తీర్చిదిద్దారు. అలంకారసేవను వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ప్రధానాలయ తూర్పు పంచతల రాజగోపురం ముందు సూర్యప్రభవాహన సేవను అధిష్టింపజేసిన ఆచార్యులు ప్రత్యేక పూజలు చేపట్టి రథసప్తమి విశిష్టతను భక్తులకు వివరించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి స్వర్ణతాపడ దివ్యవిమానరథంపై తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. రథసప్తమి వేడుకలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం నిర్వహించగా ఆయన అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

యాదగిరీశుడి సన్నిధిలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆండాళ్ అమ్మవారిని దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకస్వాములు ఊంజల్‌సేవలో తీర్చిదిద్ది తిరువీధి సేవోత్సవం నిర్వహించారు. అష్టభుజి ప్రాకారమండపంలోని అద్దాల మండపంలోని ఊయలలో అధిష్టింపజేసి అనంతరం ఊంజల్ సేవోత్సవం కొనసాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,47,078 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా భక్తుల సౌకర్యార్థం కొండపైన బస్‌బేలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుచేసిన ఏటీఎంను దేవస్థాన అధికారులు పూజలు నిర్వహించి ప్రారంభించారు. అదేవిధంగా ఈ నెల 19 నుంచి 25 వరకు కొనసాగనున్న పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను దేవస్థాన అధికారులు ఆవిష్కరించారు.

పాతగుట్టలో అధ్యయనోత్సవాలు

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక అధ్యయనోత్సవాలు రెండో రోజైన శుక్రవారం ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు ఉత్సవమూర్తులకు, ఆళ్వారాచార్యులకు పంచామృతాలతో నవకలశ స్నపనం జరిపి దివ్యమనోహరంగా అలంకరించి సేవోత్సవం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం పురప్పాట్లు సేవోత్సవం నిర్వహించిన ఆచార్యులు లక్ష్మీనృసింహుడికి, ఆళ్వార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక పర్వాలను అర్చక, రుత్వికబృందం నిర్వహించగా ఆలయ అనువంశిఖ ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు పాల్గొన్నారు.

విష్ణుపుష్కరిణి పునరుద్ధరణ పనులు

పాతగుట్ట లక్ష్మీనృసింహుడు కొలువుదీరిన కొండపైన ఉన్న విష్ణుపుష్కరిణి పునరుద్ధరణ పనులను దేవస్థాన అధికారులు దాతల సాయంతో నిర్వహిస్తున్నారు. విష్ణుపుష్కరిణిలో తెప్పోత్సవ మండపం, మెట్లను నిర్మించనున్నారు. తెప్పోత్సవ మండపంలో లక్ష్మీనృసింహుల విగ్రహాన్ని ప్రతిష్టాపనతో పాటు విష్ణుపుష్కరిణి ప్రారంభోత్సవ వేడుకలు త్వరలోనే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఘనంగా చెర్వుగట్టు ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆర్డీవో రవి, పక్కన ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప, కాంగ్రెస్ నేతలు , అధికారులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 16 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మహామంటపంలో జరిగిన కార్యక్రమంలో యాజ్ఞీకులు అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితులు, ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మలు, సహార్చక స్వాములు, వేదపండితులు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవాలను ఉత్సవ సమన్వయకర్త నల్లగొండ ఆర్డీవో రవి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. వేడుకకు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప, కుమారుడు విపుల్‌లు హాజరై పూజా కార్యక్రమాల వద్ద కూర్చున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా పూర్తవ్వాలని కోరుకుంటూ ఉత్సవ నిర్వాహకులకు కంకణధారణ చేశారు. తొలుత మహామంటపంలో ఏర్పాటుచేసిన పూజావేదికలో గణపతిపూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, ప్రోక్షణ, దీక్షాధారణ, అఖండ దీపస్థాపనతో ఉత్సవ పూజలను ప్రారంభించారు. సాయంత్రం కలశారాధాన, మత్స్యంగ్రహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. స్వామివారి ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ అర్చక స్వాములు ధ్వజారోహణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బత్తుల ఊశయ్య, రేగట్టె నర్సిరెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, నేతకాని కృష్ణయ్య, నల్ల వెంకన్న, పున్నంరాజు యాదగిరి, వారాల రమేశ్, గడుసు శశిధర్‌రెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, మేకల వెంకన్న, రేగట్టె రాజశేఖర్ రెడ్డి, జెరిపోతుల భరత్, పల్లె నరేందర్‌రెడ్డి, మల్ల శంకర్, ఎండోమెంట్ సహాయ కమిషనర్ కే.మహేంద్రకుమార్, ఈవో సిరికొండ నవీన్‌కుమార్, పోలీసు అధికారులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



కొండపైకి నడుచుకుంటూ వస్తున్న భక్తులు

భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తొద్దు : ఎస్పీ

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాట్లు ఉండాలని ఎస్పీ చందనాదీప్తి ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయ పరిసరాల్లో బందోబస్తు ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఆయా ఏర్పాట్లను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఎస్పీకి వివరించారు. కొండపై కల్యాణమండపం, మూడు గుండ్లు, ప్రధానాలయం, క్యూలైన్లు, భక్తులు తలంబ్రాల బియ్యం సమర్పించే ప్రదేశాలను ఎస్పీ పరిశీలించారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఉండాలని, భక్తుల తొక్కిసలాట జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ కే.మహేంద్రకుమార్, ఆలయ ఈవో నవీన్‌కుమార్, నార్కట్‌పల్లి సీఐ, ఎస్‌ఐలు నాగరాజు, అంతిరెడ్డి ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాలికపై లైంగికదాడి.. వృద్ధుడికి 20ఏళ్ల జైలు

శిక్ష విధించిన యాదాద్రి భువనగిరి జిల్లా పోక్సో కోర్టు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 16: బాలికపై లైంగిక దాడి చేసిన వృద్ధుడికి పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షను విధించింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎస్సీ కాలనీకి చెందిన మరకల సాయిలు(77) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో పక్కకాలనీలోని మూడో తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల బాలికను చాక్లెట్లు, బిస్కెట్లు తదితర చిరుతిళ్లతో ప్రలోభపెట్టి సాయిలు లైంగికదాడి చేశాడు. కొద్దికాలానికి కడుపు నొప్పితో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లడంతో అత్యాచార ఘటన వెలుగుచూసింది. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యులు 2019, జనవరి 18వ తేదీన బీబీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేయగా భువనగిరి రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేసి నిందితుడు మరకల సాయిలును గుర్తించి పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి జరిగిన కోర్టు విచారణలో నిందితుడిపై ఆరోపణలు నిజం కావడంతో, సాయిలుకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ భువనగిరిలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి కే.మారుతీదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా సాక్ష్యాధారాలను సేకరించిన పోలీసులను కోర్టు ప్రశంసించింది.

నిందితుడిని పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. బాలికకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాకు సిఫారసు చేసినట్లు న్యాయాధికారి తెలిపారు. కేసును వాదించిన స్పెషల్ పీపీ రవీందర్‌రెడ్డిని అభినందించారు. బాలిక తల్లిదండ్రులు చనిపోవడంతో ప్రస్తుతం మేనత్త వద్ద పెరుగుతోంది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ముగ్గురు సిబ్బంది మెమోలు జారీ



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చింతపల్లి పల్లె దవాఖానాలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి కృష్ణకుమారి

చింతపల్లి, ఫిబ్రవరి 16 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమారి హెచ్చరించారు. 'కాలపరిమితి ముగిసిన ఔషధాల పంపిణీ, వైద్యసిబ్బంది నిర్లక్ష్యం' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాలమేరకు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమారి శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలోని పల్లె దవాఖానాను తనిఖీచేశారు. రికార్డులను, ఔషధాలను పరిశీలించారు. పల్లెదవాఖానాకు వచ్చే రోగులకు ఇస్తున్న ఔషధాల వివరాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పల్లె దవాఖానాకు పేద రోగులు వస్తారని వారికి కాలం ముగిసిన ఔషధాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కాలం ముగిసిన ఔషధాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందజేయడంతో పాటు ఎప్పటికప్పుడు గడువు తీరకుండా ఉన్న ఔషధాలను మాత్రమే రోగులకు ఇవ్వాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సూపర్‌వైజర్ విజయతో పాటు మరో ఇద్దరు సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ కృష్ణకుమారి ఆంధ్రజ్యోతితో తెలిపారు. ఆమె వెంట పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, సిబ్బంది ఉన్నారు.

అంతర్ జిల్లా సెంట్రింగ్ సామగ్రి దొంగల అరెస్ట్

చిట్యాల, ఫిబ్రవరి 16 : సెంట్రింగ్ సామగ్రిని దొంగిలించే అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. శుక్రవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను సీఐ నాగరాజు, ఎస్‌ఐ సైదాబాబుతో కలిసి వెల్లడించారు. చిట్యాల మండలం వట్టిమర్తిలో మెట్టు కృష్ణయ్యకు సంబంధించిన సెంట్రింగ్ సామగ్రిని చింతపల్లి నర్సింహ ఇంటి నిర్మాణం కోసం ఉంచగా ఈ నెల 15న గుర్తుతెలియని వ్యక్తులు ఓ వాహనంలోకి ఎత్తుతుండగా శబ్దాలు విని లేచిన నర్సింహ కుటుంబసభ్యులు గట్టిగా కేకలు వేయడంతో వాహనంలో పారిపోయారు. సదరు బాధితులు అదేరోజు చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం ఎస్‌ఐ సైదాబాబు ఆధ్వర్యంలో పోలీసులు జాతీయ రహదారిపై రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని గమనించిన నిందితులు వాహనం వదిలి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం మర్లపాడ్ తండాకు చెందిన సభావత్ సత్తయ్య, రమావత్ దేవలా, అచ్చంపేట మండలం ఘనపురం గ్రామానికి చెందిన అంగోతు నీలావతి, నల్లగొండ జిల్లా చందంపేట మండలం బుద్ధవణి గ్రామానికి చెందిన కేతావత్ జానీ, కేతావత్ నాన్కు, దేవరకొండ మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన రమావత్ పద్మలతో పాటు మరో ముగ్గురు మైనర్లు ముఠాగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో సెంట్రింగ్ సామానును దొంగిలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు దొంగతనాలు, రామన్నపేట పరిధిలో ఒకటి, చిట్యాల పరిధిలో రెండు, కట్టంగూరు పరిధిలో ఒక దొంగతనం చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2లక్షల 120సెంట్రింగ్ బాక్స్‌లు, రూ.4లక్షల నగదు,అశోక్ లీలాండ్ వాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీన చేసుకున్నట్లు తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ సత్యనారయణ, ఎస్‌కే అహ్మద్, నాగరాజు, కలీం, సాయికుమార్, లింగయ్య, చిన్నబాబు, వరలక్ష్మి, హోంగార్డులు సందీప్, శ్రీనులను డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- మిర్యాలగూడలో ఇద్దరిని బలిగొన్న అతి వేగం
- భువనగిరిలో మరొకరు..



రుద్రాక్ష రాంబాబు, శ్రీను(ఫైల్‌ఫొటోలు)

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 16 : వేగంగా దూసుకొచ్చిన కారు ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. గురువారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని నార్కట్‌పల్లి - అద్దంకి జాతీయ రహదారిపై నందిపాడు చౌరస్తా వద్ద ఈ సంఘటన జరిగింది. స్థానికులు, టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందిపాడు చౌరస్తా దగ్గరలో ఉన్న నవనీత వైన్స్‌షాపునకు అనుసంధానంగా నడిపిస్తున్న పర్మిట్‌రూంలో స్థానిక శాంతినగర్‌కు చెందిన రుద్రాక్ష రాంబాబు(38), బంగారుగడ్డకు చెందిన మద్దెల శ్రీను(26) సప్లయర్స్‌గా పనిచేస్తున్నారు. ఈ రూంను మూసివేసేంత వరకు సిట్టింగ్‌లో ఉన్న వినియోగదారులకు మద్యం సరఫరా చేశారు. విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి బయలుదేరారు. తాము పనిచేస్తున్న వైన్స్‌షాపునకు కొద్ది దూరంలో ఉన్న నందిపాడుచౌరస్తా వద్ద పట్టణంలోకి ప్రవేశించేందుకు బైక్‌ను మళ్లిస్తున్న క్రమంలో హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందజేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. రాంబాబుకు భార్య విజయలక్ష్మితో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పర్మిట్ గదిలో మద్యం సరఫరా చేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఏపీ రాష్ట్రం కడప జిల్లా పులివెందులకు చెందిన మద్దెల శ్రీను కొంతకాలంగా పట్టణానికి వలసవచ్చి బంగారుగడ్డలో ఉంటూ వైన్స్‌షాపులకు చెందిన పర్మిట్ గదిలో సప్లయర్‌గా పనిచేస్తున్నాడు. రాంబాబు అకాల మృతితో బాధిత కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. విషయం తెలుసుకున్న బంధువులు ఏరియా ఆసుపత్రికి చేరుకోగా వారి రోదనలు మిన్నంటాయి. రాంబాబు భార్యాపిల్లల రోదనలు అందరినీ కలచివేశాయి. శుక్రవారం ఉదయం మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీను మృతదేహాన్ని ఆస్పత్రిలో భద్రపరిచి కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. రాంబాబు భార్య విజయలక్ష్మి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. ప్రమాదానికి కారణమైన హైదరాబాద్‌కు చెందిన కారు యజమాని కనకేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

లారీ ఢీకొని బోడుప్పల్ వాసి మృతి

భువనగిరి టౌన్: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పెద్దచెరువు కట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పట్టణ ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌కు చెందిన కడియాల శంకర్‌రెడ్డి(45) టైల్స్ కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. ఈ మేరకు భువనగిరిలో కొనసాగుతున్న పనులను పరిశీలించి మిత్రుడు చంద్రశేఖర్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. పెద్దచెరువు కట్ట సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో శంకర్‌రెడ్డి లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందగా చంద్రశేఖర్‌కు స్వల్పగాయాలయ్యాయి. శంకర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న మినీ ట్రాన్స్‌పోర్ట్, ఒకరికి తీవ్రగాయాలు

చింతపల్లి, ఫిబ్రవరి 16 : మినీట్రాన్స్‌పోర్ట్ వాహనం, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన బైకాని పెద్దయ్య తన బైక్‌పై చింతపల్లి మండలం కుర్మేడులో శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా కుర్మేడు స్టేజీ సమీపంలో చింతపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో పెద్దయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను వీటీనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య మృతికి కారకుడైన భర్తకు మూడేళ్ల జైలు

- భార్య మరణ వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం

మిర్యాలగూడ లీగల్, ఫిబ్రవరి 16 : ఓ ఇల్లాలి మృతికి కారణమైన భర్తకు మూడేళ్ల జైలు, జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ అదనపు సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా బాలెంల మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన మణెమ్మకు లక్ష్మీపురం గ్రామానికి చెందిన గంధం బాలసైదులుతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. మూడేళ్ల పాటు అన్యోన్యంగా ఉన్నారు. వీరికి రోహిత్, మనస్విని సంతానం కలిగారు. ఆ తర్వాత బాలసైదులు భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానిస్తూ, పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు కాకుండా అదనంగా డబ్బులు కావాలని శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. తట్టుకోలేక మణెమ్మ పుట్టింటికి వెళ్లింది. దీంతో కాపురానికి రావడంలేదని బాలసైదులు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా ఇరువురికి పెద్దలు సర్దిచెప్పడంతో భార్యను తన ఇంటికి తీసుకెళ్లాడు. అయినా అతడి వేధింపులు ఆపలేదు. 2016 డిసెంబరు 29న బాలసైదులు మద్యం సేవించి భార్యను కొట్టాడు. అవమానం భరించలేని మణెమ్మ ఇంటి కాంపౌండ్ గోడ దగ్గర కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. చుట్టుపక్కల మంటలు ఆర్పి ఆమెను మిర్యాలగూడ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాలిన గాయాలతో మణెమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 2017 జనవరి 3న మృతిచెందింది. అంతకుముందు ఆసుపత్రిలో మణెమ్మ మరణవాంగ్మూలాన్ని అప్పటి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.పద్మజ నమోదు చేశారు. మృతురాలు మణెమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్‌ఐ కె.శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా డీఎస్పీ రాంగోపాల్‌రావు దర్యాప్తు పూర్తి చేసి బాలసైదులుపై చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.వేణు శుక్రవారం విచారణలో బాలసైదులుకు వ్యతిరేకంగా ఎవరూ చెప్పకపోయినప్పటికీ మణెమ్మ మరణ వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం అతడిపై ఐపీసీ 304-బి సెక్షన్ 306 కిందకు పరిగణలోకి తీసుకోని న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా, అదనపు కట్నం కింద మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు శిక్షలు కూడా ఏకకాలంలో అమలవుతాయని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పీపీ మన్నెం మనోహర్‌రెడ్డి కేసు వాదించారు. ప్రాసిక్యూషన్‌కు రూరల్ కోర్టు కానిస్టేబుల్ నేనావత్ కిషన్, జానకిరాములు, కోర్టు లైజన్ అధికారి చెరుపల్లి సైదులు సహకరించారు.

ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఆందోళన

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 16 : వైద్యుడి నిర్లక్ష్యంతో బాలిక మృతి చెందిందని నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ప్రైవేట్ ఆసుపత్రికి ఎదుట బాధితులు ఆందోళన చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలం ఇర్కిగూడెంకు చెందిన బాలిక కిందపడి గాయపడింది. బాలికను మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురాగా ఆపరేషన్ అవసరమని వైద్యుడు తేల్చాడు. అందుకు తండ్రి సమ్మతించడంతో తానే స్వయంగా మత్తు మందు ఇచ్చి ఆపరేషన్‌కు సిద్ధమయ్యాడు. మత్తుమందు ఇచ్చిన కొద్దిసేపటికే బాలిక రంగు మారి, కోమాలోకి వెళ్లింది. మెరుగైన చికిత్స కోసం తల్లిదండ్రులు బాలికలను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీంతో వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని ఆరోపిస్తూ బాలిక బంధువులు శుక్రవారం రాత్రి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెద్దమనుషులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా ఈ విషయమై బాధితుల నుంచి తమకు ఫిర్యాదు అందలేదని టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

కాంగ్రెస్‌లోకి చలమల్ల కృష్ణారెడ్డి



దీపాదాస్‌మున్షిని సన్మానిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్, ఫిబ్రవరి 16: బీజేపీ రాష్ట్రనేత చలమల్ల కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మునుగోడు ఉపఎన్నికకు ముందు కాంగ్రెస్‌లో చేరిన కృష్ణారెడ్డి ఆ సందర్భంగా టికెట్ ఆశించారు. పార్టీ అధిష్ఠానం అప్పటికే పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న పాల్వాయి స్రవంతికి కేటాయించింది. ఆ తర్వాత ఎన్నికల్లో సముచిత స్థానం కల్పిస్తామనడంతో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఆయన పనిచేశారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మరోసారి పార్టీ టికెట్ ఆశించారు. కానీ బీజేపీలో ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో అధిష్ఠానం ఆయనకే టికెట్‌ను కేటాయించింది. దీంతో కృష్ణారెడ్డి బీజేపీలో చేరారు. మునుగోడు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుంచి బీజేపీకి కూడా కృష్ణారెడ్డి దూరంగా ఉంటు న్నారు. కాంగ్రెస్‌లో చేరికతో సీఎం రేవంత్‌రెడ్డి అనుచరుడిగా పేరున్న కృష్ణారెడ్డికి భవిష్యత్‌లో తగిన గుర్తింపు లభిస్తుందని అనుచరులు భావిస్తున్నారు. కాగా కృష్ణారెడ్డి భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం స్వాధీనం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ చోట్ల కలిపి మొత్తం 190 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, పలువురిపై కేసు నమోదు చేశారు.



మాచారంలోని కోళ్ల ఫారంలో నిల్వ చేసిన రేషన్‌బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై అధికారులు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 16 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దోరకుంట పంచాయతీ పరిధి నెమలిపురి కాలనీలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. డీలర్ల వద్ద మధ్య దళారులు కొనుగోలు చేసిన బియ్యాన్ని నెమలిపురి గ్రామంలో చింతారెడ్డి కోటిరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో దళారీ వ్యాపారి సుల్తాని రాంబాబు 350 బస్తాల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారని సమాచారం అందడంతో శుక్రవారం ఆ ఇంటిపై దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. రాంబాబు పరారీలో ఉన్నాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోళ్ల ఫారంలో నిల్వ

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం గ్రామ శివారులోని జీఎన్‌ఆర్ కోళ్ల ఫారంలో అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఆర్. జ్యోతి సీజ్ చేశారు. కొంత మంది వద్ద కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మందడి అంజిరెడ్డి, కట్ట ప్రవీణ్ కలిసి కోళ్ల ఫారం యజమానికి విక్రయించారు. విషయం తెలుసుకున్న సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ జ్యోతితో పాటు నల్లగొండ ఆర్‌ఐసీఎస్ లింగస్వామి, ముక్తార్‌లు కోళ్ల ఫారంకు చేరుకుని బియ్యాన్ని పరిశీలించి, సీజ్ చేసి కేసు నమోదుచేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని నకిరేకల్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు.

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ డీటీ జ్యోతి సీజ్ చేశారు. కేతేపల్లి గ్రామానికి చెందిన జటంగి వీరయ్య తండ్రి భిక్షం ఉప్పలపహాడ్ గ్రామంలోని నంద్యాల సరోజనమ్మ ఇంట్లో ఒక గదిని అద్దెకు తీసుకుని అందులో తాను సేకరించిన అక్రమ రేషన్ బియ్యాన్ని నిల్వ చేసింది. సమాచారం అందుకున్న పౌరసరఫరాల డీటీ జ్యోతి పోలీసులతో కలిసి గ్రామంలోని నంద్యాల సరోజనమ్మ ఇంటిని గురువారం రాత్రి 11.30 గంటలకు తనిఖీ చేశారు. తనిఖీలో 20 క్వింటాళ్ల అక్రమ బియ్యం సీజ్ చేసి నిందితులపై 6ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని అధికారులు వెల్లడించారు. అక్రమంగా బియ్యాన్ని సేకరించి నిల్వ చేసిన వారిని ఉపేక్షించేది లేదని, బాధ్యులు ఎంతటి వారైనా విడిచిపెట్టేది లేదని అధికారులు హెచ్చరించారు.

గ్రామీణ బంద్ విజయవంతం

దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక, విపక్ష నాయకులు నినదించారు. ప్రధాని మోదీని గద్దె దింపితేనే దేశానికి రక్షణ ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్‌చేశారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామీణ బంద్‌లో పలువురు పాల్గొన్నారు. అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు కొనసాగాయి.


నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌లో అఖిలపక్షాల నాయకుల సంఘీభావం


తిప్పర్తి: ధర్నా నిర్వహిస్తున్న పలు కార్మికుల సంఘాలు


చిట్యాల: కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


మాట్లాడుతున్న వీరారెడ్డి


దామరచర్ల: రాస్తారోకో చేస్తున్న ఆయా సంఘాల నాయకులు


దేవరకొండ: పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు


కనగల్: నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు


మాడ్గులపల్లి: రాస్తారోకో చేపడుతున్న వివిధ రంగాల కార్మికులు


మిర్యాలగూడ : బంద్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల కార్మికులు


హాలియా: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


కొండమల్లేపల్లి: కేంద్ర దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


కేతేపల్లి : సమ్మెలో పాల్గొన్న వివిధ సంఘాల కార్మికులు

అధికారుల బాధ్యతల స్వీకరణ


నల్లగొండ కమిషనర్ ముసాబ్ అహ్మద్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 16: జిల్లా రెవెన్యూ అధికారిగా డి.రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ మెట్రోరైలు భూసేకరణ విభాగంలో స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను జిల్లాకు బదిలీ చేశారు. అదేవిధంగా ఐ అండ్ క్యాడ్ స్పెషల్ కలెక్టర్‌గా ఎ.నటరాజును నియమించారు. ఆయన మహబూబ్‌నగర్ బీమా ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి రానున్నారు.

● **రామగిరి:** నల్లగొండ మునిసిపల్ కమిషనర్‌గా సయ్యద్ ముసాబ్ అహ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న బదిలీల ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు ఇదే కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన ముసాబ్ అహ్మద్ పదోన్నతిపై కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియలో భాగంగా సిద్ధిపేట మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సంపత్‌కుమార్ నల్లగొండకు బదిలీ అయి విధుల్లో చేరకుండానే తిరిగి వెళ్లిపోవడం గమనార్హం.


రాజశేఖర్‌రాజు

● **మిర్యాలగూడ అర్బన్:** మిర్యాలగూడ డీఎస్పీగా కె.రాజశేఖర్‌రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటగిరి హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నిజామాబాద్ టాస్క్‌ఫోర్సులో ఏసీపీ హోదాలో పనిచేసిన రాజశేఖర్‌రాజు మిర్యాలగూడకు వచ్చారు.

● **చండూరు:** చండూరు ఎంపీడీవోగా వీఎల్ అనురాధ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన యాకూబ్‌నాయక్ యాదాద్రిభువనగి రి జిల్లాకు బదిలీఅయ్యారు. ఆయనస్థానంలో అనురాధ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

● **మర్రిగూడ:** మర్రిగూడ ఎంపీడీవో జీసీ మున్నయ్య బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్‌రావు సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు.

● **నిడమనూరు:** నిడమనూరు ఎంపీడీవోగా గుర్రం వెంకటేశం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహించిన ప్రమోద్‌కుమార్ యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలానికి బదిలీఅయ్యారు. ఆయనస్థానంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకటేశం ఇక్కడికి వచ్చారు.

● **నిడమనూరు:** నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జిగా ఎ.సబిత బాధ్యతలు చేపట్టారు. యాదాద్రిభువనగిరి జిల్లా మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సబితను నిడమనూరు మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● **దేవరకొండ:** దేవరకొండ ఎంపీడీవోగా జె.సుదర్శన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శర్మ సిద్ధిపేట జిల్లా ములుగు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వికారాబాద్ జిల్లా తాండూరులో ఎంపీడీవోగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

● **కనగల్:** కనగల్ ఎంపీడీవోగా చిలకమర్రి జయరాం బాధ్యతలు స్వీకరించారు.

● **మునుగోడు:** మునుగోడు నూతన ఎంపీడీవోగా కె.పూజ పదవీ బాధ్యతలను స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా నుంచి ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు.

● **కట్టంగూరు:** కట్టంగూరు ఎంపీడీవోగా పెరుమాళ్ల జ్ఞానప్రకాష్‌రావు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎంపీడీవో పి.సునీత బదిలీపై సూర్యాపేట జిల్లా నూతనకల్‌కు వెళ్లారు. యాదాద్రి జిల్లా ఆలేరు మండలం ఎంపీడీవోగా పనిచేసిన జ్ఞానప్రకాశ్‌రావు బదిలీపై కట్టంగూరుకు వచ్చారు.

● **కేతేపల్లి:** కేతేపల్లి మండల ఎంపీడీవోగా బి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వై.హరికృష్ణ జోగులాంబ గద్వాలకు బదిలీ అవ్వగా, సూర్యాపేటలో పనిచేస్తున్న శ్రీనివాసరావు కేతేపల్లికి వచ్చారు.

● **నార్కట్‌పల్లి:** నార్కట్‌పల్లి ఎంపీడీవోగా కె.ఉమేష్ బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

● టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 16: ఉద్యోగుల చిరకాల కోరిక అయిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపుమేరకు శుక్రవారం టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇన్‌కం ట్యాక్స్ పరిమితిని రూ.10లక్షలకు పెంచాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలని, పీఆర్సీని వెంటనే అమలుచేయాలన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి జె.శేఖర్‌రెడ్డి, సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరి విజయకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహాచారి, నాయకులు ఆకునూరి లక్ష్మయ్య, గామయ్య, వెంకట్‌రెడ్డి, మధుసూదనాచారి, మనోజ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

'నియామకాలు చేపట్టామనడం సిగ్గుచేటు'


సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 16: గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఉద్యోగ నియామకాలను కాంగ్రెస్ తమ ప్రభుత్వ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే జేఎల్, డీఎల్ ఇంటర్వ్యూలను చేపట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి అసెంబ్లీ సమావేశంలో లక్ష ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు, 1.65లక్షల మంది ఉగ్యోగ ఖాళీలను భర్తీ చేసినట్లు ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వమే ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగులకు రూ.5వేల భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్వీ నాయకులు నోముల శంకర్ యాదవ్, నర్సింహ, కిరణ్, రాకేష్, గణేష్, లింగస్వామి, నానియాదవ్, గజ్జి రాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం

మిర్యాలగూడ టౌన్, దేవరకొండ, అడవిదేవులపల్లి, చింతపల్లి, ఫిబ్రవరి 16: ప్రశాంత జీవనానికి ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రథసప్తమి సందర్భంగా జిల్లాలోని పలు పట్టణాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని సూచించారు.

● మిర్యాలగూడ లైబ్రరీలో యోగా క్లబ్ ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా నిర్వహించిన సూర్య నమస్కారాల యోగా సాధనను ఎమ్మెల్యే బీఎల్ఆర్ తిలకించి మాట్లాడారు. దైవచింతన, యోగా, మెడిటేషన్ మనస్సును ఉత్తేజ పరుస్తాయని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో కుమ్మరికుంట్ల సుధాకర్, కోల సైదులు, శ్రీనివాసరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● దేవరకొండలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయం, రామాలయం, అయ్యప్పస్వామి దేవాలయాల్లో రథసప్తమి పురస్కరించుకొని పూజలు చేశారు. దేవరకొండ పట్టణంలోని రెండవవార్డులో మైసమ్మ దేవాలయంలో రథసప్తమి పురస్కరించుకొని కుంకుమార్చన, హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గంటసాల శర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి మండలంలోని కృష్ణానది శివారులో గల బౌద్ధమ దేవాలయాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, వింజం శ్రీధర్, కూరాకుల మంగమ్మచినరామయ్య, ఎంపీపీ బాలాజీనాయక్, జడ్పీటీసీ సేవ్యానాయక్, వైస్ ఎంపీపీ కూరాకుల మల్లీశ్వరిగోపినాథ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పోలు నాగార్జున, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీవో లలితసుబ్బారెడ్డి, ఎస్‌ఐ హరిబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


చింతపల్లిలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు

● చింతపల్లి మండలంలోని గొల్లపల్లి సమైఖ్యనగర్‌లో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని బీఆర్‌ఎస్ రాష్ట్రనేత కంకణాల వెంకట్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి రథోత్సంలో పాల్గొన్న అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వి.బాల్‌సింగ్‌నాయక్, నక్క ప్రేమలత పరమేష్, మహిమూద్, మల్లేష్‌యాదవ్, వెంకటయ్య, రాములు, మహేందర్, జంగయ్య, బిక్షమయ్య పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి


ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కొండమల్లేపల్లి, మిర్యాలగూడ, ఫిబ్రవరి 16: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆటో యూనియన్ కార్మిక సంఘం మండలాల అధ్యక్షులు జి.వెంకన్న, జిల్లా రవి కోరారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కొండమల్లేపల్లి చౌరస్తా, మిర్యాలగూడలో ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఫైనాన్స్ చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆటోడ్రైవర్ల పొట్ట కొట్టవద్దని వేడుకున్నారు. ఫైనాన్స్ చెల్లించలేక ఆర్తికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిరాల శ్రీనివాస్, జహంగీర్, గోవర్ధన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడలోని ఈదులగూడ చౌరస్తాలో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు మాత్రమే బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బంటు శేఖర్, పేరపాక శ్రీను, సాల్మన్, సైదులు, ఖదీర్, రమేష్, నవీన్, సురేష్, రాజు, మల్లయ్య, రాజశేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా బీసీలు ఉద్యమించాలి

● బీసీ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 16: చట్టసభల్లో బీసీల రాజ్యాధికారం దిశగా యువత ఉద్యమించాలని తెలంగాణ బీసీ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ అన్నారు. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపడతామని చెప్పడం సంతోషించదగిన విషయమని, వెంటనే చేపట్టాలని కోరారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర బడ్జెటులో బీసీల అభివృద్ధికి 2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకరి మల్లేష్‌వర్మ మాట్లాడుతూ జాతీయస్థాయిలో తెలుగు రాష్ట్రాల మాదిరిగా పూర్తి ఫీజుల రీయింబర్స్‌మెంట్, ప్రతీ విద్యార్థికి రూ.20వేల స్కాలర్‌షిప్ పథకం అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొల్లు సతీష్, కంబాలపల్లి సంపత్‌యాదవ్, నాగరాజు, అఫ్జల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు ఇంటర్ ఇన్విజిలేషన్ డ్యూటీలు వేయవద్దు

నల్లగొండ, ఫిబ్రవరి 16: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణ కోసం ఉపాధ్యాయులకు డ్యూటీలు వేయవద్దని, ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం కోరారు. ఈ విధానం వల్ల సగం మంది ఉపాధ్యాయులు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాబోధనకు దూరమవుతున్నారని అన్నారు. విద్యా సంవత్సరం చివరిలో బోధనకు చాలా ప్రాధాన్యముంటుందని తెలిపారు. ఉపాధ్యాయులకు డ్యూటీలు వేస్తే పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు.

'విద్యార్థినుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి'

హాలియా, ఫిబ్రవరి 16: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థినుల ఆత్మహత్యలపై, జన్వాడ బాధితులపై జరిగిన దాడి విషయంలో ప్రభుత్వం స్పందించాలని బీఎస్పీ జిల్లా జాయింట్ సెక్రటరీ తక్కెళపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి, సూర్యాపేట గురుకులాల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యల విషయంలో నిర్లక్ష్యం వహించిన వారిని సస్పెండ్ చేసి ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సాంఘిక, సంక్షేమ హాస్టల్‌కు ఒక సైకాలజిస్టును ఏర్పాటు చేయాలన్నారు. చనిపోయిన ప్రతి విద్యార్థి కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జన్వాడలో ఆర్‌ఎస్ఎస్ గూండాలు చర్చి కూలగొట్టి దళిత, మైనార్టీలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో నాయకులు ముదిగొండ వెంకటేశ్వర్లు, కుక్కముడి ముత్యాలు, మధు, రవి, శేఖర్, లక్ష్మయ్య, శంకర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తుదారుడికి సమాచారం అందించాలి : బుర్రి

రామగిరి, ఫిబ్రవరి 16: మునిసిపల్ కార్యాలయంలో ఏ విభాగంలోనైనా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుడికి పని పూర్తయినట్లు, అతనికి సమాచారం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవికాలంలో దృష్టిలో ఉంచుకొని తాగునీరు సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామంలో వెలిసిన ఉమామహేశ్వర గంగాభవానీ ఆలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 18వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు కొబ్బరికాయలు, లడ్డూ ప్రసాదం వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దండ యాదగిరిరెడ్డి తెలిపారు.

దేవరకొండ: దేవరకొండలో ఈ నెల 19వ తేదీన జరగనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని విజయవంతం చేయాలని శివాజీ యువదళ్ ఆధ్వర్యంలో దేవరకొండలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

మాడ్గులపల్లి: మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సింగం శివ బాబాయి సింగం అంజయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్, నాయకులు లొడంగి గోవర్ధన్, కందుల లక్ష్మయ్య, నరేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రావు, నర్సింహ, శ్రీను, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: బీసీల కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టడం హర్షనీయమని బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూడా వెంటనే కులగణన చేయాలని ఆయన కోరారు.

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లిలోని రెడ్డీస్ పరిశ్రమలో స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చొరవ తీసుకోవాలని ఇరిగి క్రాంతికుమార్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా గ్రామంలో మిషన్‌భగీరథ పథకంతో భాగంగా నిర్మించిన 3 ట్యాంకుల్లో రెండు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. దీంతో ప్రజలు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

డిండి: జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో డిండి మోడల్‌స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించారని ప్రిన్సిపాల్ కరుణాకర్ తెలిపారు. మోడల్‌స్కూల్‌కు చెందిన వి.మాధవి, కె.రాజేశ్వర్, శరత్, శ్రీకాంత్, సాయికిరణ్ మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. జేఈఈతోపాటు నీట్, ఎంబీబీఎస్, ఎంసెట్ కాంపిటేషన్ పరీక్షలు, ఎన్‌ఎంఎంఎస్‌లో కూడా విద్యార్థులు ప్రతిభ చాటినట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: విద్యార్థినులకు అండగా బంజారా మహిళా సంస్థ పనిచేస్తుందని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆనంద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు పరీక్షా సామగ్రి అందజేశారు. బాలికల అక్షరాస్యతను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సంస్థ సభ్యులు, మిత్రబృందంతో కలిసి దేశవ్యాప్తంగా విద్య, వైద్య సేవలతో పాటు శానిటరీ నాప్కిన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుజాత, గోవిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడంపై బీసీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ బీసీ కులగణన నిర్ణయం చారిత్రాత్మకమని, ఇకపై బీసీలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏకగ్రీవ తీర్మానం చేపట్టడంపై బీసీ సంఘాల నేతలు పోగుల సైదులుగౌడ్, పగిడి జీడయ్యయాదవ్, మహేష్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పానుగంటి విజయ్, వరికుప్పల మధు, వీటీ పాల్గొన్నారు

నల్లగొండ టౌన్: నర్రా రాఘవరెడ్డి స్మారక ప్రజావైద్యశాల, ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం రోగులకు ఈ నెల 18వ తేదీన మూడో ఆదివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంవీఎన్ ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నల్లగొండటౌన్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని మహాజన సోషలిస్టు పార్టీ సూర్యాపేట, నల్లగొండ జిల్లాల అధ్యక్షులు యాతాకుల రాజయ్యమాదిగ, బకరం శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని జెఎస్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 19వ తేదీన జరిగే సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలంమాదిగ, మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు కురుపాటి కమలమ్మ, నాయకులు యాదయ్య, బొజ్జ చిన్న, సన్ని, ఏడుకొండలు, రాంబాబు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో శీతల పరమేశ్వరి (బొడ్రాయి) సహిత ముత్యాలమ్మ, కోట మైసమ్మ, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే బొడ్రాయి పండుగ కార్యక్రమాలను గ్రామస్థులు ప్రారంభించి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ కార్య నిర్వాహకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలకేంద్రంలోని సాగర్ రోడ్డులో గల వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతాపారాయణం, కుంకుమార్చన, లలిత, విష్ణు సహస్ర నామాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాత మంచికంటి రాధయ్య దంపతులను కమిటీ సభ్యులు సన్మానించారు.

తాటికోలులో జూదరుల అరెస్ట్

దేవరకొండ, ఫిబ్రవరి 16: దేవరకొండ మండలం తాటికోలు గ్రామశివారులోని తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురుని అదుపులోకి తీసుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాటికోలు గ్రామశివారులోని తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో పేకాట ఆడుతున్న నాంపల్లి మండలం మేళ్లవాయికి చెందిన గిరి, దుగ్యాలకు చెందిన వెంకటేష్, వాసు, వెంకటయ్య, వెంకటేష్‌లను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, రూ.64,640 నగదును, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ నర్సింహులు వివరించారు.

CLASSIFIEDS

కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7207445296

AJV_183137

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/-Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST
9985413365, 9985413656
7702511532

SURYAPET DIST
9703618713,
9985401015

YADADRI BHONGIRI DIST
9177572576